# తిరుగు ప్రయాణం

ఎక్కడి నుంచో వచ్చి ఎవరినో వెదకి, వెదకి అలసిపోయిన ఆదిత్యుడు తిరుగు ప్రయణానికి సిద్ధమవుతున్నాడు.

రోజంతా తిరిగి అలసిపోయిన నేను ముందుకు పోలేక పోయాను, రైల్వేస్టేషన్‌లోని సిమెంటు బల్లమీద కూలబడ్డాను.

"ఓ పండు కూడా అమ్మలేదురా" ఫ్లాట్ ఫారంమీద పళ్ళబండి లాగూతూ వెళుతున్న వాడు అన్నాడు "టయిము అయిపోయినాది. కనీసం పది రూపాయలున్నా చేర్చాలనుకున్నాను".

వాడి గొంతులో వ్యక్తమయిన బాధ నాకర్థమయింది. తన లక్ష్యం చేరుకోలేక పోయానని బాధ పడుతున్నాడు అతడు.

నేను నిట్టూర్చాను. నేను కూడా అతని కోవకి చెందినవాడినే.

రవిని కలవటం నా లక్ష్యం. రెండు రోజులు ప్రయాణం చేసి వచ్చాను. కానీ రవి కనబడలేదు.

రవి నా స్నేహితుడు ఉత్త స్నేహితుడే కాదు, నాకు నాగరికత నేర్పిన ఆప్తమిత్రుడు.

కాలేజీలో చేరిన మూడు నెలలకి పరిచయ మయ్యాడు రవి. చదువు గురించి మన్యపు ప్రాంతంనుంచి నగరానికి వెళ్ళిన నన్ను వింతగా చూసేవారు విద్యార్థులు. అవకాశం కుదిరితే ఆట పట్టించేవారే కానీ ఏ ఒక్కరూ ఆప్యాయంగా పలుకరించేవారు కాదు.

రవి అతనంతట అతనే చనువు తీసుకొని నాతో మాట్లాడేవాడు.

"నువ్వు ఇలా ఉంటే లాభంలేదురా" ఓ రోజు రవి అన్నాడు. "నువ్వు యిప్పుడు నగరంలో ఉన్నావు నీ వేషం, భాషా అంతా మార్చేయ్యాలి"

"వేషంలో ఏముంది?" నేను నవ్వుతూ అన్నాను. "నాగరికత మనిషి

ప్రవర్తనలోనూ, ఆలోచనలోనూ ఉండాలి కానీ, వేషంలో మాత్రం ఉంటే ఏమిటి ప్రయోజనం".

రవి అంటే కాలేజీలో అందరికీ గౌరవం అతను బుద్ధిమంతుడు, సంస్కారవంతుడు అవటమే కాదు దానికి కారణం. రవి నాన్నగారు దానశీలి అడిగిన వారికి కాదనక శక్తికోలదీ ఇచ్చేవారు కళాశాల నిర్మాణానికి కూడా చాలా విరాళాలు ఇచ్చారట ఆయన!

చదువు పూర్తి అవగానే మీ ఊరిలో ఉద్యోగం వచ్చింది నాకు, ఆ వార్త చెప్పగానే రవి మొహం వాడిపోయింది.

'నువ్వు ఏమన్నానసరే' రవి అన్నాడు. "నువ్వు ఈ ఉద్యోగంలో చేరటం నాకు ఇష్టం లేదురా".

నేను ప్రశ్నార్థకంగా చూశాను!

"ఇంత నాగరికత నేర్చుకున్నాక మళ్ళీ అడవిలోకి వెళతానంటున్నావేమిటిరా?"

"అలా అనకురా" నేనన్నాను " నేను నేర్చుకొన్న విద్య, నాగరికతనూ వాళ్ళకు నేర్పించటం నా ధర్మం కదా?"

అయిష్టంగానే నాకు వీడ్కోలు చెప్పాడు రవి.

మొదట్లో తరచూ ఉత్తరాలు వ్రాసేవాడు. క్రమేపీ ఉత్తరాల సంఖ్య తగ్గిపోయింది. సంవత్సరం నుంచి అసలు ఉత్తరమే లేదు.

విసుగుపుట్టి నేనే బయలుదేరి వచ్చాను రవిని కలవాలని, తాళం వేసి ఉన్న రవి ఇల్లు చూసి ఆశ్చర్య పోయాను.

"ఏం చెప్పమంటారు బాబు" రవి గురించి అడగగానే పక్కింటి ముసలాయన అన్నాడు. "మంచి వాళ్ళకి ఇది కాలం కాదు".

అతను ఓ నిముషం మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తున్నట్టు కనబడ్డాడు. తరువాత మెల్లగా అన్నాడు " రవి తల్లిదండ్రులు ఎంతో మంచివాళ్ళు ఎన్నో మంచి పనులు చేశారు గానీ....."

"కానీ... బందిపోట్లు డబ్బంతా దోచుకొని నిర్దాక్షిణ్యంగా చంపేశారు బాబు"

నాకు షాక్ తగిలినట్టు అయింది. మరి రవి.....

"పిచ్చివాడిలా ఇక్కడిక్కడే తిరుగుతూ ఉండేవాడు బ్రతుకు గడవాలి కదా?

ఉద్యోగాల గురించి ప్రయత్నం చేసేవాడు" ముసలాయన కళ్ళు చెమర్చాయి " ఆరు నెలల నుంచీ రవి కనిపించటం లేదు".

నా కాళ్ళ క్రింద భూమి బద్దలైనట్లు అనిపించింది. అక్కడ నిలబడ లేక పోయాను మా ఊరు వెళ్లిపోవాలి.

ప్లాట్ ఫారం చాలా హడావిగాను, సందడిగాను ఉంది ఏదో బండి వచ్చినట్లుంది. మెల్లగా లేచాను.

నాగరికతకు ప్రతిబింబంగా నిలచే, నియోన్ బల్బులు ఫ్లాట్ ఫారంలో ఉన్న చీకటిని పూర్తిగా తొలగించలేక పోతున్నాయి. వెలిగే బల్బులకన్నా వెలగని బల్బులే కదా ఎక్కువ!

గబగబా ముందుకు నడిచాను

అప్పుడు కనిపించాడు రవి!

ఫ్లాట్‌ఫారం మీదున్న టీ.వి. సెట్‌లో కనిపించింది, రవి ఫోటో - క్రింద ఒక ప్రకటన.

"ప్రముఖ బందిపోటు రవి ఆచూకీ తెలిపిన వారికి లక్షరూపాయలు బహుమతి" కళ్ళు చిట్లించి మరీ మరీ చూశాను అవును వాడు రవే!

అలా ఉండిపోయాను.

ట్రైన్ కూత కూసింది బయలు దేరటానికి సిద్దంగా. అప్పుడు గుర్తొంచింది. నేను తిరుగు ప్రయాణంలో ఉన్నానని.

నేనొక్కడినే కాదు మానవులంతా...

పల్లకి వినూత్న వారపత్రిక 6-4-94